క్లుప్తంగా

కుష్టు సర్వేపై నిర్లక్ష్యం వహించొద్దు



సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ అనుపమ జేమ్స్

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు ఇంటింటా సర్వే చేపడుతోందని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ అనుపమ జేమ్స్ అన్నారు. మంగళవారం మండలంలోని గొటుకూరులో జరుగుతున్న ఇంటింటా కుష్టు సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులను వాడితే నయమవుతుందన్నారు. సర్వేపై నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పలువురు దాతల విరాళాలు అందజేశారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో మంగళవారం గంగవరానికి చెందిన నంజుండప్ప రూ.25,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్‌ను ఉపఖజానా కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు శివప్రసాద్, అంజినప్ప, ఫక్రుద్దీన్, వీరభద్రయ్య, కృష్ణమూర్తి, మల్లికార్జున, భగవాన్, క్రిష్టయ్య పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో స్కిల్ హబ్ సెంటర్‌లో మూడు నెలల పాటు ఉచితంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఇస్తామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా విద్యా అర్హత ఉన్న యువతీ యువకులు ఈ నెల 10లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9182920381 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉపసంచాలకుడు వెంకటేష్

ఉరవకొండ: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు జి.వెంకటేష్ సూచించారు. మంగళవారం విడపనకల్లులోని పశు వైద్యశాలలో గాలికుంట వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, ఎద్దుల్లో పనిసామర్థ్యం తగ్గే లక్షణాలు కన్పిస్తే టీకాలు వేయించాలన్నారు. గ్రామాల్లోని పశువులకు పశుసంవర్ధక సిబ్బంది టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ కాంతమ్మ, డాక్టర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బొమ్మనహాళ్: 2024 సంవత్సర ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ-2 మల్లికార్జున, ఏపీటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శులు వన్నూరుస్వామి, లక్ష్మీనారాయణ, జిల్లా అసోసియేట్ కార్యదర్శి హనుమప్ప, రాయదుర్గం జోన్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన క్యాలెండర్‌ను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి గోవిందురాజులు, అర్జున్, చిత్తప్ప, నాగరాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు భరోసా



ఉరవకొండ మండలం వెలిగొండలో మందులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



రాయదుర్గం మండలం మెచ్చిరిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యురాలు ప్రతిభ



బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని ఎంపీపీ నరసింహులు అన్నారు. మంగళవారం మండలంలోని వెలిగొండ గ్రామంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈఓఆర్డీ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. క్యాంపులో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందించడమే కాకుండా శస్త్రచికిత్సలు అవసరమైన వారిని కార్పొరేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం రెఫర్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరాంజనేయులు, పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామంలో ఎంపీడీఓ కొండయ్య, సర్పంచ్ ఊలెమ్మ అధ్యక్షతన మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రజారోగ్య సంరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అనంతరం వైద్యపరీక్షలు చేయించుకున్నవారికి డాక్టర్ ప్రతిభ జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. శిబిరంలో 405 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యులు రాజేంద్ర ప్రసాద్, మాధవ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, బండి శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు, మహేష్ , మాజీ ఎంపీటీసీ భీమప్ప ,ఈఓపీఆర్డీ రంగనాయకులు, ఎంఈఓ వెంకటరమేష్ , పంచాయతీ కార్యదర్శి హేమంతరాజు తదితరులు పాల్గొన్నారు.



కణేకల్లు మండలం 43 ఉడేగోళంలో చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పావని

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం డైరెక్టర్ సుజాత, డీఎల్‌డీఓ శంకర్, ఎంపీడీఓ సాలమాన్, ఎంపీపీ మారుతమ్మ, సర్పంచ్ శోభా రాణి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. వైద్యశిబిరంలో 250 మందికి చికిత్స చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలాజి, డాక్టర్లు విజేంద్ర, ప్రత్యూష, జమీల, భారతి, బోరంపల్లి వాటర్‌షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజినేయులు, నాయకులు సోమశేఖర్ రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండంలోని పిల్లలపల్లిలో మంగళవారం రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ వాణీశ్రీ, ఎంపీడీఓ దాసానాయక్, సర్పంచ్ తలారి గోవిందప్ప ప్రారంభించారు. అ కార్యక్రమంలో ఏఓ నందకిశోర్, వైద్యాధికారులు రాజేష్, అబ్బాబ్, రాధరాణి, దామోదర్, కన్యాకుమారి, పంచాయితీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని 43 ఉడేగోళం గ్రామంలో రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా 362 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గూడెన్న, డాక్టర్లు చంద్రమనోహర్, చంద్రశేఖర్‌నాయక్, పావని, ఉమదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేమన, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుకార్తీయ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురావు, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాయదుర్గంలో..

రాయదుర్గంటౌన్: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నుంచి నిర్వహించనున్నారు. పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్లలో నిర్వహించే ఆరోగ్య సురక్ష క్యాంపుల వివరాలను మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి వెల్లడించారు. వారానికి ఒక సచివాలయం చొప్పున మే 8 వరకూ వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. బుధవారం పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో క్యాంపు ఏర్పాటు చేశామన్నారు.

విజయవంతం చేయాలి

గుమ్మఘట్ట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి, వైద్యుడు రమేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఈ నెల 5 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: రెండో విడుత జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని వైద్యాధికారి అనూషా సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఆశా కార్యకర్తలకు 'జగనన్న సురక్ష' విజయవంతం, సీజనల్ వ్యాధులపై చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 14వ వార్డు డ్రైవర్స్ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కాలనీవాసుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాలనాయక, అయ్యప్ప గ్రామోత్సవం



కుందుర్పి మండలం తమ్మయ్యదొడ్డిలో పూజలందుకుంటున్న పాలనాయకస్వామి



బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో అయ్యప్ప విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

కుందుర్పి: మండలంలోని తమ్మయ్యదొడ్డిలో మంగళవారం పాలనాయకస్వామి జాతర వైభవంగా నిర్వహించారు. స్వామిని శ్రీమజ్జనపల్లి నుంచి తమ్మయ్యదొడ్డికి గ్రామోత్సవంగా తీసుకువచ్చి ఉదయం గంగపూజ, మధ్యాహ్నం గ్రామోత్సవం చేపట్టారు. రాత్రికి స్వామిని వెండి పల్లకిలో ప్రతిష్ఠించి ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో అయ్యప్ప మాలధారులు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, మాలధారులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

ఉరవకొండ(విడపనకల్లు): విడపనకల్లు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడాదుస్తులు, క్యాప్‌లు, ఇతర సామగ్రి ఎంపీపీ కరణం పుష్పవతి, జెడ్పీటీసీ హనుమంతు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సత్యబాబు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా మొత్తం 18 సచివాలయాలకు 2,052 టీ షర్టులు, క్యాప్‌లు పంపిణీ చేశారు.



విడపనకల్లులో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



గోనబావిలో ఆంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అడ్డపల్లకిలో తీసుకువచ్చి రథంలో అధిష్ఠించి అశేష జనవాహిని సమక్షంలో మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. రథోత్సవం ముందు భాగంలో యువకులు నందికోళ్లతో ఉత్సాహం నృత్యం చేశారు.



స్వాధీనం చేసుకున్న మద్యం చూపుతున్న పోలీసులు

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్: కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసి, 65 (90 ఎంఎల్) మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని నేమకల్లుకు చెందిన కురుబ రామాంజనమ్మ అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి అమ్ముతుండగా అరెస్టు చేశామన్నారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వై.భీమిరెడ్డి, బ్యాంకు అధికారులు

వజ్రకరూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఖోఖో కమిటీ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కొనకొండ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరాబ్యాంకు సౌజన్యంతో స్టీల్ ప్లేట్లు, క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 710 మంది విద్యార్థులకు రూ.లక్ష విలువ చేసే స్టీల్ ప్లేట్లు, రూ.10 వేల విలువచేసే క్రీడా పరికరాలను బ్యాంకు అధికారులతో కలిసి ఆయన అందజేశారు. ఆయన మాట్లాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు డివిజినల్ మేనేజర్ వెంకటరాంప్రసాద్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ కట్టా శ్రీధర్, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌నాయక్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్, హెచ్‌ఎం వేణుగోపాల్, పేరెంట్స్ కమిటి చైర్మన్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంచర్ల లాలెప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ పంపిణీ

▶▶ హాజరు కానున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద లబ్ధిదారులకు రూ.3 వేలు పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి విచ్చేసి పింఛన్ అందజేస్తారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ, అనుబంధ సంఘాల నేతలు, నాయకులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉరవకొండ: గ్రామ పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ మీనుగ లలితమ్మ తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలో తాగునీటి సమస్య, వ్యవసాయ ప్రణాళిక, ఉపాధి హామీ నిధులు, మహిళా సంక్షేమం, గృహ నిర్మాణం, పారిశుధ్యం తదితర అంశాలపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఉరవకొండలో పారిశుధ్యం ఎంతో మెరుగుపడిందన్నారు. అలాగే వేలాది మందికి గృహాలు నిర్మించి ఇచ్చామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు అందించామన్నారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై గ్రామసభలు

రాయదుర్గం రూరల్/శెట్టూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచుల అధ్యక్షతన మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. సభల్లో గత సమావేశంలో చర్చించిన అంశాలు, సమస్యల పరిష్కారం గురించి పంచాయతీ కార్యదర్శులు చదివి వినిపించారు. ఇందులో భాగంగా రాయదుర్గం మండలంలోని బీఎన్‌హళ్లిలో సర్పంచ్ గొల్ల చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో సహజ వనరులు, తాగునీరు, పారిశుధ్య పనులపై చర్చించారు. అనంతరం ఆయా విభాగాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామసభల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే శెట్టూరు మండంలోని బచ్చేహళ్లి, చిన్నంపల్లి, అనుంపల్లి, అయ్యగార్లపల్లిలో గ్రామాభివృద్ధి ప్రణాళికలపై గ్రామ సభలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, సర్పంచులు భారతి, ప్రకాష్, పాలయ్య, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

▶▶ కాలిన గృహోపకరణాలు

వజ్రకరూరు: మండలంలోని పందికుంట బీసీ కాలనీలో మంగళవారం 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో కాలనీకి చెందిన బోయ కిష్టన్న, దొడ్డి శ్రీనివాసులు, నారాయణస్వామి, జొల్ల నారాయణ, గువ్వల భాస్కర్‌తో పాటు మరికొందరి ఇళ్లలో ఫ్యాన్లు, ఫ్రిజ్జులు, టీవీలు తదితర గృహోపకరణలు పూర్తిగా కాలిపోయాయి. ఏం జరుగుతుందో అర్థంకాక కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లల్లోని గృహోపరణాలు కాలిపోవడంతో రూ.వేలల్లో నష్టపోయామని బాధితులు వాపోయారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు. సర్పంచు పి.ఉమామహేశ్వరి, పార్టీ బీసీ సెల్ కార్యదర్శి దొడ్డి శ్రీనివాసులు తదితరులు ఘటనను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

పైపులైన్ పగిలి నీరు వృథా

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లి ప్రధాన రోడ్డ పక్కన మంగళవారం రాత్రి శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైన్ పగలడంతో తాగునీరు వృథా అవుతోంది. అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు చేయాలని ప్రజలు కోరారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారులు

కళ్యాణదుర్గం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత ఆదేశాల మేరకు ఎన్నికల డీటీ వెంకటేశులు, సహాయకులు శ్రీనివాసులు, సిబ్బంది అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ప్రతి మండలంలో ప్రత్యేక మొబైల్ టీంతో అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ గవిమఠ సంస్థానం, ఉరవకొండ - అనంతపురము జిల్లా

ఆర్.సి. నెం. 1/2024 — **సీల్డ్ టెండర్ ప్రకటన** — తేది: 02-01-2024

పై మఠము నందు మార్చి నెలలో నిర్వహించబడు బ్రహ్మోత్సవముల నిర్వహణకు అవసరమైన వివిధ పనులకు అనగా (1) బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలు, బుక్‌లెట్స్, వాల్‌పోస్టర్స్ ముద్రించుట, (2) ఫోటోలు, వీడియోలు తీయుట, (3) బాణసంచా సరఫరా, (4) జాయింట్ వీల్ నిర్వహించుకొనుట, (5) బ్రహ్మోత్సవకాలంతో బాటు 30-09-2024 వరకు కూరగాయలు సరఫరా చేయుట, (6) బ్రహ్మోత్సవకాలంతో బాటు 30-09-2024 వరకు పూలు, పూలమాలలు సరఫరా చేయుట, అడ్డపల్లకి, రథోత్సవంకు పూల అలంకరణ చేయుట, (7) బ్రహ్మోత్సవ కాలంతో బాటు 30-09-2024 వరకు పూజా, నైవేద్య సామాగ్రి, అన్నప్రసాద సరుకులు సరఫరా కొరకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. ఆసక్తికలవారు ఆయా పనికి సంబంధించిన టెండరు షెడ్యూల్ కొరకు రూ. 500/-లు చెల్లించవలసి వుండును. సీల్డ్ టెండరు షెడ్యూల్ కొరకు తేది : 04-01-2024 నుండి 10-01-2024 వరకు దరఖాస్తు చేసుకొనవలెను. "దరఖాస్తు చేసుకొన్న వారికి మాత్రమే టెండరు షెడ్యూల్స్ జారీ చేయబడును". టెండరు షెడ్యూల్స్ జారీ చేయు తేది / సమయం : 11-01-2024 మరియు 12-01-2024 కార్యాలయ పనివేళలలో. ధరలు కోట్ చేయబడిన టెండరు షెడ్యూల్స్ బాక్స్ నందు వేయవలసిన తేది / సమయం: 17-01-2024 ఉ॥ గం॥ 11-00 నుండి మ॥ గం॥ 1-00 వరకు. టెండరు బాక్స్ మూయు/క్లోజ్ చేయు తేది / సమయం: 17-01-2024 మ॥ 1-00 గం.కు. టెండరు బాక్స్ తెరుచు తేది / సమయం: 17-01-2024 మ॥ గం. 3-00 కు. ఇతర వివరములకు ల్యాండ్ లైన్ నం. 08496 - 257104, సెల్ నెంబర్లు : 85155 12107, 84910 00740 లను సంప్రదించగలరు.

సం/- సహాయ కమిషనరు / మేనేజరు
శ్రీ గవిమఠ సంస్థానం, ఉరవకొండ (టౌన్), అనంతపురము (జిల్లా)

यूनियन बैंक Union Bank of India — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
బెళుగుప్ప శాఖ, మెయిన్ రోడ్డు,
బెళుగుప్ప, అనంతపురము జిల్లా

REF: RECALL/10 — Date:02/01/2024

1) శ్రీమతి గడపూటి సరస్వతి, భర్త: గడపూటి మల్లికార్జున, డోర్ నెం.2-60, ఒ.సి. కాలని, ఎస్.హనుమాపురము గ్రామము, కణేకల్ మండలము, అనంతపురము జిల్లా-515822
1) శ్రీమతి గడపూటి శ్యామల, భర్త: జి. వెంకటేశులు, డోర్ నెం.2-56, ఒ.సి. కాలని, ఎస్.హనుమాపురము గ్రామము, కణేకల్ మండలము, అనంతపురము జిల్లా-515822

విషయము: రీకాల్ నోటీసు

మీ లోన్ అకౌంట్ నెంబర్లు
1)560931000364213-Sanction Limit Rs.15,00,000.00
2)009525030000619 -Sanction Limit Rs.13,00,000.00

మీరు మా బ్యాంకు నుండి రూ॥28,00,000/- (రూపాయలు ఇరవై ఎనిమిది లక్షలు మాత్రమే) పరిమితి గల రుణ సదుపాయం (క్రాప్ & టర్మ్‌లోన్స్) వినియోగించుకున్నారని మేము మీకు తెలియచేస్తున్నాము. మేము పలుమార్లు కోరతూ, రిమైండర్లు పంపినప్పటికీ , మీరు ఖాతాలోని చెల్లించవలసిన బకాయి మొత్తము నిమిత్తము ఎటువంటి మొత్తాన్ని మీరు చెల్లించలేదు.మరియు మీరు బాధ్యతలను తీర్చలేదు. అందువలన మీ యొక్క పైన తెలిపిన ఖాతా 30/11/2023న ఎన్.పి.ఎగా వర్గీకరించబడినది. 30/11/2023 నాటికి మీ ఖాతాలోరూ॥28,00,000/- (రూపాయలు ఇరవై ఎనిమిది లక్షలు మాత్రమే) చెల్లించవలసిన బకాయి మొత్తముగా ఉంది.

మీరు అమలు చేసిన రుణ డాక్యుమెంట్లలోని నియమనిబంధనల ప్రకారము ఇప్పటి వరకు వడ్డీతో కలిపి రూ॥28,23,359.90 (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల ఇరవై మూడు వేల మూడు వందల యాభై తొమ్మిది మరియు తొంభై పైసలు మాత్రమే) ఉన్న బకాయి మొత్తము చెల్లించి 7 రోజులలోగా మీ రుణ బాధ్యతలను పూర్తిగా తీర్చవలసిందిగా మేము మిమ్మలను ఇందుమూలముగా కోరుతున్నాము, ఆ విధముగా చేయుటలో విఫలమైతే, బ్యాంకు మీకు వ్యతిరేకముగా తన బకాయిలను రాబట్టుకొనుటకు చర్య/దావా వేయవలసి ఉంటుంది. చట్టానికి అనుగుణంగా మీ అసెట్స్, ఆస్తులు లేదా మరేదైనా వాటి ద్వారా మీ చిరునామాదారులు అందరి నుండి చెల్లించవలసి బకాయి ఉన్న పూర్తి మొత్తాన్ని రాబట్టుకొనుటకు బ్యాంకు ఇతర మార్గాలు కాని, వివిధ వేదికలను ఆశ్రయించవలసిఉంటుంది. తర్వాత ఎదురయ్యే పరిణామాలకు మీరు బాధ్యత వహించవలసి ఉంటుంది.

సం/ శాఖ నిర్వహణాధికారి, బెళుగుప్ప శాఖ

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010006852, 9010223701